క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శాఖ మండల అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రీ కటింగ్‌తోపాటు లైన్ మెయింటెనెన్స్ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సమ్మెకు మద్దతు

దమ్మపేట: న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ.. గత వారం రోజులుగా సమ్మె చేస్తున్న గిరిజన సహకార సంస్థ(జీసీసీ), హమాలీలకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ తరపున మంగళవారం మద్దతు ప్రకటించారు. హమాలీల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ, దీక్షలో కాసేపు కూర్చున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కొర్సా వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎగుమతి, దిగుమతి కూలీ రేట్లను పెంచి, పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీలకు ఆరోగ్య భద్రత, పీఎఫ్‌లతో పాటుగా పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

మణుగూరురూరల్: మండలంలోని ఉడతానేని గుంపు ప్రాంతంలోని నేనుసైతం రెస్పాన్సిబిలిటి ఆర్గనైజేషన్ వారి అమ్మనాన్న వృద్ధాశ్రమానికి హెచ్‌బీడీ ఫైనాన్స్ కంపెనీ వారి ఆధ్వర్యంలో మంగళవారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్లు, పండ్లను ఏరియా మేనేజర్ బట్టా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు బ్రాంచ్ మేనేజర్ ఆకుల నరేష్, భద్రాచలం బ్రాంచ్ మేనేజర్ పార్థసారథి, పాల్వంచ మేనేజర్ సంపత్, మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామ ప్రజల సమస్యలపై తహసీల్దార్ స్వర్ణలతకు తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వలస ఆదివాసీ గిరిజనులు 15 ఏండ్లుగా నివాసం ఉంటున్నా ఇంటి పన్నులు, కరెంటు, రహదారి సౌకర్యం లేదని గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి, బీసీ విభాగం మండల అధ్యక్షుడు మేడిపల్లి రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఈటీకి సన్మానం

మణుగూరుటౌన్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పీఈటీ ఉషాకిరణ్ హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ లెవల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025లో ప్రతిభ కనబరచగా.. మంగళవారం ఆమెను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజాభవన్‌లో సన్మానించి అభినందించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పోటీల్లో 400 మీటర్లు రన్నింగ్‌లో మొదటిస్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో రెండో స్థానం, ఐదు కిలోమీటర్ల రన్నింగ్‌లో రెండో స్థానాల్లో గెలిచి పతకాలు అందుకున్నారు. కాగా మంగళవారం ప్రజాభవన్‌లో ఉషాకిరణ్‌ను ఎంఈఓ స్వర్ణజ్యోతితో కలిసి అభినందించారు. ఫిబ్రవరి 1వ తేదీన కేరళలో జరిగే నేషనల్ అథ్లెటిక్స్‌లో పాల్గొని మణుగూరు ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. మండల నాయకులు కొర్సా ఆనంద్ పాల్గొన్నారు.

మొక్కలు పంచిన చిన్నారి



మొక్కలు పంపిణీ చేస్తున్న దీక్షిత

అశ్వారావుపేట: పుట్టిన రోజు సందర్భంగా తోటి చిన్నారులకు పండ్ల మొక్కలను పంపిణీ చేసి వినూత్నంగా జన్మదినం జరుపుకుంది చిన్నారి. అశ్వారావుపేట పూర్ణచంద్ర నర్సరీ నిర్వాహకుడు గుడిపల్లి ప్రవీణ్ కుమార్తె దీక్షిత స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. మంగళవారం దీక్షిత జన్మదినం సందర్భంగా తోటి విద్యార్థులకు పండ్ల మొక్కలు పంపిణీ చేసింది. వినూత్నంగా పండ్ల మొక్కలను పంపిణీ చేసిన దీక్షితను, తల్లితండ్రులను ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

ములకలపల్లి: మహిళలు అన్నిరంగాల్లోనూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ కరుటూరి కృష్ణ సూచించారు. మండలకేంద్రంలోని గుడ్‌షపర్డ్ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మహిళల స్వయం సహాయక సంఘాలు ఏర్పడి, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలని సూచించారు. సిస్టర్స్ దీప్తి, రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ధ్రువపత్రాలు, హెల్మెట్ తప్పనిసరి
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పోలీసులు



మణుగూరురూరల్: మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్



అశ్వాపురం: మండల కేంద్రంలో చేపట్టిన ర్యాలీలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై రవూఫ్



పినపాక: మాసోత్సవాల నేపథ్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, సిబ్బంది

అశ్వాపురం: ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి అతి వేగంగా వాహనాలు నడపవద్దన్నారు. ఎస్సై రవూఫ్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడు, వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని కోరారు.

పినపాక: వాహదారులు రోడ్లపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మాసోఉత్సవాల నేపథ్యంలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బయ్యారం క్రాస్ రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. వాహనదార తో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, లేదంటే అతి వాహనాలను జప్తు చేస్తామన్నారు. తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఎవరైనా రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని గుండాల ఎస్సై రాజమౌళి, ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ లు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ మందితో డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. వాహనాలపై అధికలోడుతో ప్రయాణించరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు నియమాలు పాటిస్తూ లైసెన్సులు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. నియమాలు పాటించని వారిపై తగు చర్యలు ఉంటాయని అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడప రాదని హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.



గుండాల: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రతీష్

మణుగూరురూరల్: ప్రతిఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మణుగూరు సీఐ సోమ సతీష్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మణుగూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సురక్షా బస్టాండ్ ప్రాంతంలో ఆటో డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు జ్యోతి, శాంతి, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీలేదు..



పినపాక: సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: నియోజకవర్గ అభివద్ధిలో రాజీలేదని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పదంలో నడిపిస్తామని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం అమరారం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అమరారం గ్రామపంచాయతీలో 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం సమీక్ష సమావేశంలో పాల్గొని శాఖల వారీగా రివ్యూ చేపట్టారు. సంక్రాంతి పండగ నుంచి మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసామని, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో మరొక వెయ్యి ఇల్లు తీసుకొచ్చామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు మిషన్ భగీరథ సమస్యను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లగా.. త్వరలోనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టంకటే అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.తాతారావు, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ కొమరం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని 11 మంది ఆడపడుచులకు మంజూరైన కల్యాణ్ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాయన వెంకటేశ్వర్లు సోమవారం పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కూతుర్లకు పెళ్లి చేయటానికి డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్న ఆడపడుచులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో హామీలకు మేరకు నగదుతో పాటు తులం బంగారం కూడా అందజేస్తామని తెలిపారు. మహిళలు స్వయం శక్తిగా ఎదగడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 66 మందికి రూ.22.70 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చర్ల: బాలికలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పూజ అన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు చర్లలోని గురుదేవ్ విద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, మంచినీరు ఎక్కువగా తాగాలని సూచించారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, వాటిని తినడం ద్వారా అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, ప్రధానోపాధ్యాయులు హెచ్‌జీవీ గిరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



శ్రీగోదా అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. పండితులు ప్రసాదచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి సన్నిధిలో ఆరాధన, అభిషేకాలు చేశారు. శ్రీగోదా అమ్మవారి కళ్యాణోత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హుండీ ఆదాయం రూ.2.73 లక్షలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఇన్‌గేట్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలోని హుండీల ఆదాయాన్ని ఆలయ అధికారుల పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. అమ్మవారి భక్తులు సమర్పించిన కానులను నాలుగు నెలలకు గాను హుండీల ఆదాయం లెక్కించగా రూ.2,73,191 లక్షలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి గుజ్జా సుదర్శన్, ఆలయ చైర్మన్ గంగా భారతి, అర్చకులు విశ్వనాథంతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీలో రక్తదాన శిబిరం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు ఈ శిబిరంలో పాల్గొని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఎవరైనా చనిపోతే శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బంది పడుతున్నామని రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ నక్షలో దారి ఉన్నప్పటికీ దానిని కొంత మంది ఆక్రమించారని, దీంతో ఎస్సీ కాలనీ, కాలువబజార్, చిన్నతండా, మల్లమ్మసెంటర్ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు ఇసంపల్లి కృష్ణ, గద్దల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు గద్దల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

మణుగూరురూరల్: నిషేధిత చైనా మాంజా దారాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు ఎఫ్ఆర్ఓ ఉపేందర్ గాలిపటాల దుకాణదారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని గాలిపటాల విక్రయ దుకాణాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చైనా మాంజాదారాల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి చైనా మాంజాదారాల విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, స్ట్రైకింగ్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గాలిపటాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్ఆర్ఓ ఉపేందర్

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

మణుగూరురూరల్: గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ఎంతో మేలు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, నాయకులు ఎడ్ల శ్రీనివాస్, అక్కి నర్సింహారావు, ఆవుల నర్సింహారావు, ఎడవల్లి వెంకటయ్య, మాజీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ, రాజేశ్వరరావు, పెంటుమియా, సునీత, రమణ, వసంత పాల్గొన్నారు.

బలరాముడిగా పర్ణశాల రామయ్య

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా ఆరో రోజు మంగళవారం పర్ణశాల రామయ్యను బలరామావతారంలో అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామిని బలరామావతారంలో అలంకరించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు మల్లూరు రవికుమార్‌శర్మ, నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ములకలపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల సమయాన పొలం పనులకు వెళుతున్న రైతు, ఆ వెనకాల అప్పుడే వీగిపోతున్న మంచు తెరలు తొలచుకొని తొంగిచూస్తున్న ప్రభాత సూర్యుడు.. వెరసి చక్కటి పల్లెటూరి వాతావరణాన్ని కళ్లముందు ఆవిష్కరించినట్లుంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది. -ములకలపల్లి

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి నియోజకవర్గ ముఖ్య కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్‌బాబు పలు అభివృద్ధి, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ పనులతో ఇతర అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించి త్వరతరగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. తగిన చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు నాయకులు తెలిపారు. మంత్రిను కలిసిన వారిలో ముఖ్య నాయకులు కోటగిరి సత్యంబాబు, రావు గంగాధర రావు, చిన్నంశెట్టి యుగంధర్, బత్తుల అంజి, పర్సా వెంకట్, ఎర్రగొర్ల రాధాకృష్ణ, చెన్నారెడ్డి ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద నిరసన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం ఎదుట మంగళవారం మండల తుడుందెబ్బ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెసా కమిటీ, గ్రామసభ తీర్మానం లేకుండా ఆలయానికి నూతన కమిటీని నియమించడం తగదన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఆలయానికి గిరిజనులకు అవకాశం కల్పించకుండా, గిరిజన చట్టాలను విస్మరించడం ఎమ్మెల్యేకు సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు

'ఎక్సలెంట్'కు బెస్ట్ ఇన్నోవేటివ్ అవార్డు

మణుగూరుటౌన్: మణుగూరు ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ పాఠశాలకు 2024 సంవత్సరానికి బెస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్ ఆఫ్ ద ఇయర్-2024 అవార్డును ప్రకటించారు. హైదరాబాద్‌లో హెచ్ఐసీసీ నోవాటెల్‌లో మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వారి ఆధ్వర్యంలో హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ అవార్డు-2024 కార్యక్రమంలో బెస్ట్ ఇనోవేటివ్ స్కూల్ ఆఫ్‌గా ఎక్సలెంట్ స్కూల్ గెలుచుకున్నదని ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ యూసఫ్ షరీఫ్ మంగళవారం తెలిపారు. ఈ అవార్డుతో తమపై మరింత బాధ్యత పెరిగిందని నూతన ఆవిష్కరణకు విద్యార్థులను ప్రొత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ మెనేజింగ్ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డి, సిడిలెంట్ గ్రూప్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ మోహన్‌రెడ్డి, ప్రీతారెడ్డి, మల్లారెడ్డి, భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు నర్సయ్య గౌడ్ ఉన్నారు.

ముగ్గుల పోటీలు..

భద్రాచలంటౌన్: స్థానిక ఏఎస్ఆర్ కాలనీలో జిమ్ కోచ్ రవి బృందం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు పట్టణ ఎస్సై విజయలక్ష్మి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ ముగ్గుల పోటీలలో 35 మంది పాల్గొనగా వీరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. జీవీ రామిరెడ్డి, జీవి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, గుగులోతు శోభన్, వెంకటకృష్ణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ జీవన భృతి ఇవ్వాలి



చర్ల: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



దమ్మపేట: లింగాలపల్లిలో నిరసన తెలుపుతున్న మాస్‌లైన్ అనుబంధ రైతు సంఘం నాయకులు

దమ్మపేట: కుటుంబం, వ్యవసాయ భూమి వంటి వివరాలతో నిమిత్తం లేకుండా వ్యవసాయ రంగంలో కూలీ పనులు చేసుకుని, జీవనం కొనసాగిస్తున్న ప్రతి కార్మికుడికీ ఇందిరమ్మ ఆత్మీయ భృతి పథకం ద్వారా రూ.12,000లను ఇవ్వాలని, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లింగాలపల్లి గ్రామంలో ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఊకే అప్పారావు, కాకా రమేష్, తాటి సత్యం, చాపా ముత్యాలరావు, పండూరి వీరబాబు పాల్గొన్నారు.

ములకలపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రకటించిన విధంగా భూమిలేని కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన వాగ్దానాన్ని నెరవేర్చాలని అన్నారు. సంఘ మండల కార్యదర్శి మాలోతు రావూజా, నాయకులు జగ్గు, సామిని, పులి వెంకటేశ్వర్లు, సుధాకర్, శ్రీను పాల్గొన్నారు.

చర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఇస్తానన్న రూ.12 వేలను ఎటువంటి షరతులు లేకుండా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సంఘం ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి బందెల చంటి మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు, నాయకులు కారం నరేష్, పొడుపుగంటి సమ్మక్క, నాగేశ్వరావు, కృపావరం, బాబు, శ్రీను పాల్గొన్నారు.